క్లుప్తంగా

24న కామదహనం

ఆసిఫాబాద్‌అర్బన్: ఈనెల 24వ తేదీన పాల్గుణ పౌర్ణిమ పురస్కరించుకొని ఆదివారం కామదహనం, 25న సోమవారం హోలీ పండుగ జరుపుకోవాలని డీడీఎస్ జిల్లా అధ్యక్షుడు ఒజ్జల శిరీష్‌శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం కామదహనాన్ని రాత్రి 7గంటల నుంచి 9 గంటల లోపు నిర్వహించుకోవచ్చన్నారు.

ఎన్నికలపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఐకేపీ సిబ్బంది

వాంకిడి: మండల కేంద్రంలో శుక్రవారం మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఎన్నికలు, ఓటు హక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వాసులకు ఓటు నమోదు, వినియోగంపై వివరించారు. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఓటు హక్కు కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీలు వేణుగోపాల్, విఠల్, భీంరావు, కవిత, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న ఆర్‌సీవో గోపిచంద్‌నాయక్

కాగజ్‌నగర్‌రూరల్: పదో తరగతి విద్యార్థులు శ్రద్ధతో చదివి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆర్‌సీవో గోపిచంద్‌నాయక్ అన్నారు. పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలను శుక్రవారం పరిశీలించారు. విద్యార్థులు పరీక్షలు ఎలా రాస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. పేద విద్యార్థుల కోసం విద్య అందించడానికి ప్రభుత్వం కోట్ల రూపాయల ఖర్చు పెడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మంగ, ఉపాధ్యాయులు నంద, ఫౌజియా, ఆనంద్‌రావు, పీఈటీ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

'ఎంపీపీపై చర్యలు తీసుకోవాలి'

చింతలమానెపల్లి: మండల ఎంపీపీ డుబ్బుల నానయ్య తన భార్య పేరిట అక్రమంగా పింఛన్ పొందుతున్నారని మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ డోకె రాజన్న, నాయకుడు రామగోని నీలాగౌడ్‌లు ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎంపీపీ నానయ్య తన భార్య డుబ్బుల చిన్నక్కకు బోద కాలు లేకున్నా ఉన్నట్లుగా పింఛన్ తీసుకుంటున్నాడన్నారు. ఎంపీపీతో అధికారులు కలిసి సామాన్యులను వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఎంపీపీ అక్రమాలపై ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని, అక్రమంగా తీసుకుంటున్న పింఛన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

మద్యం పట్టివేత

వాంకిడి: మండలంలోని ఆర్లి గ్రామంలో నిర్వహించిన తనిఖీల్లో అక్రమంగా విక్రయిస్తున్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సాగర్ తెలిపారు. ఆర్లి గ్రామానికి చెందిన ఆదె శంకర్ కిరాణ దుకాణంలో సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించగా నిల్వ ఉంచిన మద్యం లభించిందని వాటి విలువ సుమారు రూ.2600 ఉంటుందన్నారు. మద్యం స్వాధీనం చేసుకొని శంకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గుండెపోటుతో సింగరేణి కార్మికుడి మృతి

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా ఖైరిగూడ ఓసీపీలో జనరల్ మజ్దూర్‌గా విధులు నిర్వహిస్తున్న జీవీ సత్యనారాయణ(58) అనే కార్మికుడు శుక్రవారం గుండెపోటుతో మృతి చెందాడు. తోటి కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం జనరల్ షిఫ్టులో ఎలక్ట్రీషియన్ విభాగంలో విధులు నిర్వహిస్తుండగా అస్వస్థతకు గురయ్యాడు. హుటాహుటిన గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి డిస్పెన్సరీకి తరలించారు. ప్రథమ చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి రెఫర్ చేశారు. ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

సీఆర్‌టీల వేతనాలు విడుదల చేయాలి

నార్నూర్: ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలతో పాటు ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న సీఆర్‌టీ (కాంట్రాక్ట్ రెసిడెన్సియల్ టీచర్) వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండలాధ్యక్షుడు పూసం ఈశ్రు డిమాండ్ చేశారు. రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్న సీఆర్‌టీలకు నాలుగు నెలల నుంచి వేతనాలు లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సీఆర్‌టీల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని అధికారులను కోరారు.

చివరి మజిలీ కష్టాలు!

- వాగుల్లో, రహదారుల పక్కన దహన సంస్కారాలు
- నిరుపయోగంగా శ్మశానవాటిక
- అరకొర సౌకర్యాలతో అందుబాటులోకి రాని వైనం



రహదారి పక్కనే జరుగుతున్న దహన సంస్కారాలు (ఫైల్)

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో చివరి మజిలీకి కష్టాలు తప్పడం లేదు. ఎవరైనా చనిపోతే వాగుల్లో, రహదారుల పక్కన అంతిమ సంస్కారాలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లా కేంద్రంలో పెద్దవాగు సమీపంలో నూతనంగా శ్మశాన వాటిక నిర్మించినా నిరుపయోగంగా మారింది. శ్మశానవాటికకు వెళ్లేందుకు సరైన రహదారి లేదు. అందులో కనీస సౌకర్యాలు కూడా కల్పించలేదు. గత ప్రభుత్వం శ్మశానవాటికల నిర్మాణాలు చేపట్టినా కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం శ్మశానవాటికల నిర్మాణాలపై దృష్టి సారించాలని జిల్లాకేంద్రం వాసులు కోరుతున్నారు.

వాగులు, ఒర్రెలే దిక్కు..

జిల్లాకేంద్రంలో సుమారు 40వేలకు పైగా జనాభా ఉంది. పెద్దవాగు సమీపంలో గత ప్రభుత్వం శ్మశానవాటిక నిర్మించింది. పట్టణంలో ఎవరైనా మరణిస్తే శ్మశానవాటికకు వెళ్లాలంటే చుక్కలు కన్పిస్తున్నాయి. కనీస రోడ్డు సౌకర్యం లేకపోగా రాత్రి సమయాల్లో విద్యుత్ సౌకర్యం కూడా లేక చీకట్లోనే ఇబ్బందులు పడుతూ కార్యక్రమాన్ని ముగించుకోవాల్సి వస్తుందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. వానాకాలంలో దహన సంస్కారాలు చేయాలంటే నానా తంటాలు పడాల్సి వస్తుంది. జిల్లా కేంద్రంలో కనీసం రెండు శ్మశానవాటికల నిర్మాణం చేపట్టాలని అనేకసార్లు నిరసనలతో పాటు, ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించారు. అయినా సమస్య పరిష్కారం కావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కేంద్రంలో కనీసం రెండు శ్మశాన వాటికలను అన్ని సౌకర్యాలతో ఏర్పాటు చేసి అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు.

వినియోగంలోకి తీసుకురావాలి



జిల్లా కేంద్రంలో నిర్మించిన శ్మశానవాటికను వినియోగంలోకి తీసుకురావాలి. సరైన శ్మశానవాటికలు లేక అంతిమ సంస్కారాలు చేయాలంటే తిప్పలు తప్పడం లేదు. గొడవెల్లి సమీపంలో అన్ని వసతులతో శ్మశానవాటిక నిర్మించాలి. వర్షాకాలంలో పెద్దవాగు దాటలేక రహదారులపైనే దహన సంస్కారాలు చేయాల్సి వస్తుంది.

- మహేశ్, ఆసిఫాబాద్

అధికారులు చొరవ చూపాలి



పట్టణంలో శ్మశానవాటికల నిర్మాణానికి ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపాలి. వర్షాకాలంలో శ్మశాన వాటికలకు వెళ్లాలంటే బురదలో నానా తంటాలు పడుతూ వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. గత ప్రభుత్వం శ్మశానవాటికలు నిర్మించింది కానీ కనీస వసతులు ఏర్పాటు చేయలేదు. అధికారులు చర్యలు తీసుకోవాలి.

- మురళి, ఆసిఫాబాద్

'కాంగ్రెస్‌తోనే నిరుపేదల అభివృద్ధి'



మాట్లాడుతున్న నాయకురాలు సుగుణక్క

జైనూర్: బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నాయకురాలు ఆత్రం సుగుణక్క అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రజలు ఆశీర్వదించి పార్లమెంట్‌కు పంపిస్తే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. నాయకులు పెందూర్ ప్రకాశ్, ఇస్లాం, సాబిర్, కుమ్ర భుజంగ్‌రావు, కనక గంగారాం, సుద్దాల శ్రీనివాస్, సుద్దాల ఆనంద్, సుద్దాల అశోక్ తదితరులు ఉన్నారు.

విద్యార్థి దశ నుంచే పొదుపు అలవర్చుకోవాలి



ఫారం అందజేస్తున్న మేనేజర్ సందీప్‌కుమార్

కాగజ్‌నగర్‌రూరల్: విద్యార్థి దశ నుంచే పొదుపు అలవాటు చేసుకోవాలని ఎస్‌బీఐ నజ్రూల్‌నగర్ బ్రాంచి మేనేజర్ మెరుగు సందీప్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఆరెగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎస్‌బీఐ బ్యాంకు జీరో అకౌంట్స్ ఫారాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పొదుపు అలవర్చుకోవాలనే ఉద్దేశంతో జీరో అకౌంట్‌తో ఉచితంగా బ్యాంకు ఖాతాలు తెరుస్తున్నామన్నారు. ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, మంచిర్యాల బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ కిరణ్ వర్మ, ఫీల్డ్ ఆఫీసర్ సామ్రాట్, ఉపాధ్యాయులు రవిశంకర్, రాజేశం, రమేశ్, ఫిరాసత్‌అలీ, హస్మీ, నీలిమ, శారద, మానస, సీఆర్పీ తుకారాం పాల్గొన్నారు.

గొడం నగేశ్‌కు ఘన స్వాగతం



స్వాగతం పలుకుతున్న బీజేవైఎం నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశానికి మొదటి సారిగా వచ్చిన ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి గొడం నగేశ్‌కు బీజేవైఎం ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా స్వాగతం పలికి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సుచిత్, నాయకులు సంజీవ్, వికాస్, అర్జున్, శంకర్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సైడ్ డ్రెయినేజీలు లేక ఇబ్బందులు

- రోడ్లపైనే మురికినీరు
- ఇబ్బందుల్లో ప్రజలు



సైడ్ డ్రెయినేజీలు లేని బస్టాండ్ ఏరియాలోని వ్యాపారసముదాయాల ప్రాంతం

సిర్పూర్(టి): సిర్పూర్(టి) మేజరు గ్రామపంచాయతీ పరిధిలో సైడ్ డ్రెయినేజీలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారులకు ఇరువైపులా మురుగు కాలువలు లేకపోవడంతో గ్రామపంచాయతీ పరిధిలోని ప్రజలతో పాటు ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులకు గురవతున్నారు.

ప్రధాన రహదారులపైనే..

బస్టాండ్ ప్రాంతంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా వ్యాపార సముదాయాలు ఉన్నాయి. వీరు వినియోగించిన నీరు, మురికి నీరు సైడ్ డ్రెయినేజీలు లేక ప్రధాన రహదారులపై, వ్యాపారసముదాయాల మధ్య పారుతోంది. ఎన్నో ఏళ్లుగా సైడ్ డ్రెయినేజీలు లేక ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు.

ఈసారైనా మోక్షం కలిగేనా..

పదేళ్లుగా గ్రామపంచాయతీ పరిధిలో సైడ్ డ్రెయినేజీల నిర్మాణం ఊసే లేకుండా పోయింది. స్థానిక బస్టాండ్ ప్రాంతంలో మురుగు కాలువలు లేక ఏటా వర్షాకాలంలో స్థానికులు పడే ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సిర్పూర్(టి) మేజరు గ్రామపంచాయతీ పరిధిలోని ప్రధాన రహదారుల గుండా సైడ్ డ్రెయినేజీలు, అండర్ డ్రెయినేజీలు నిర్మించి సమస్య పరిష్కరించాలని మండల వాసులు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



సిర్పూర్(టి) మేజరు గ్రామ పంచాయతీ పరిధిలో సైడ్ డ్రెయినేజీలు లేక ఇబ్బందులు పడుతున్నాం. బస్టాండ్ ప్రాంతంలోని వ్యాపారసముదాయాల వద్ద, పేట్‌మహెలా, డౌనల్ ప్రాంతాల్లోని కాలనీల ప్రజలు పడే బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి.

- లక్ష్మణ్, సిర్పూర్(టి)

అధికారులు స్పందించాలి



సైడ్ డ్రెయినేజీలు లేకపోవడంతో గ్రామపంచాయతీ పరిధిలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఏళ్లు గడుస్తున్నా సైడ్ డ్రెయినేజీలు నిర్మించలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు కాలువలు నిర్మించాలి.

- బామినే పోశం, సిర్పూర్(టి)

విద్యుత్ అంతరాయానికి చెక్



నూతన పీటీఆర్ బిగిస్తున్న విద్యుత్ సిబ్బంది

కెరమెరి: గత కొన్ని రోజులుగా మండలంలో ఏర్పడుతున్న విద్యుత్ అంతరాయానికి విద్యుత్ అధికారులు చెక్ పెట్టారు. కెరమెరి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శుక్రవారం నూతన పీటీఆర్ (పవర్ ట్రాన్స్‌ఫార్మర్) బిగించారు. గతంలో ఉన్న 3.0 ఎంవీఏ పీటీఆర్‌ను తొలగించి 5.0 ఎంవీఏ పీటీఆర్ బిగించారు. లోడు అధికంగా ఉండడంతో తరుచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, నాణ్యమైన విద్యుత్ అందించాలని కొత్త పీటీఆర్ బిగించినట్లు విద్యుత్ డీఈ వెంకటేశ్, డీఈఈ శ్రీనివాస్‌లు తెలిపారు. జిల్లా విద్యుత్ అధికారులు నాగరాజు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, అన్నపూర్ణ, జగదీశ్, ఇంద్రజ, రమేశ్, ఎస్ఎల్ఐ శ్రీరాంచంద్ర, ఎల్ఐ రాజశేఖర్, ఆలమ్, విద్యుత్ సిబ్బంది ఉన్నారు.

పంటచేనులో భౌ..భౌ..!



పంటలను పక్షులు, జంతువుల బారి నుంచి రక్షించుకునేందుకు రైతులు వినూత్న పద్ధతులు అవలంభిస్తుంటారు. అడవి జంతువుల నుంచి రక్షించుకునేందుకు పంట చేల చుట్టూ చీరలతో కంచెలు ఏర్పాటు చేస్తుంటారు. కొందరు సోలార్ పవర్ కంచెలను సైతం వినియోగిస్తుంటారు. అలాగే పక్షుల నుంచి జొన్న పంటను కాపాడుకునేందుకు లింగాపూర్ మండలం గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన రైతు జాదవ్ కృష్ణ కుక్క అరుపులతో కూడిన మైక్‌ను ఏర్పాటు చేశాడు. దీని ద్వారా ఉదయం చిలకలు, ఇతర పక్షుల నుంచి రాత్రి పశువులు, అడవి జంతువుల నుంచి పంటను రక్షించుకుంటున్నాడు.

- లింగాపూర్

పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలి



దహెగాం: అవగాహన కల్పిస్తున్న కార్యకర్త

వాంకిడి: మండలంలోని ఖమాన అంగన్‌వాడీ కేంద్రం 2లో శుక్రవారం పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులు, గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. కూరగాయలు, చిరుధాన్యాలు ప్రదర్శించి వాటిని ఆహారంగా తీసుకోవడం వల్ల లభించే ఆరోగ్య పరమైన లాభాలను వివరించారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల తల్లీ, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సావిత్రి బాయి, పొచ్చుబాయి, నిర్మల, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.

దహెగాం: మండలంలోని అమరగొండ గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్త వజ్రమ్మ ఆధ్వర్యంలో తల్లులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. పోషకాలు లభించే ఆహార పదార్థాల ప్రదర్శన చేపట్టారు. గర్భిణులు, బాలింతలు పోషకాలు ఉన్న ఆహారం తీసుకోవాలని పేర్కొన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: గర్భిణులు, పిల్లలకు అందించే పోషక విలువల గల ఆహారంపై సీడీపీవో సురేఖ అవగాహన కల్పించారు. పోషణ పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని నిజాముద్దీన్ కాలనీలో గల అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు పుష్ప, ప్రణీత పాల్గొన్నారు.

రెబ్బెన: పోషకాలతో కూడిన ఆహారాన్ని తినడం ద్వారా రక్తహీనత సమస్యను దూరం చేసుకోవచ్చని అంగన్‌వాడీల టీచర్లు సూచించారు. శుక్రవారం మండలంలోని నంబాల, చిలుకమర్రిగూడెంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షం సందర్భంగా గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాలు నిర్వహించారు. పోషక విలువలు అధికంగా ఉండే ఆహారపదార్థాలు, పాలు, కూరగాయలు, ఆకుకూరలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు జయప్రద, అమృత, హెచ్ఎం మౌనిక, పంచాయతీ కార్యదర్శి మౌనిక, ఆశా కార్యకర్త రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



వాంకిడి: మాట్లాడుతున్న అంగన్‌వాడీ టీచర్లు



రెబ్బెన: చిలుకమర్రిగూడెంలో పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

చింతలమానెపల్లి: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సీడీపీవో విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని ఖర్జెల్లి ప్రభుత్వ పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడా మాసోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. పోషకాలను అందించే ఆహారంపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాలతో చేసే వంటలను ఈసందర్భంగా ప్రదర్శించారు. అనంతరం అంగన్వాడీల ఆధ్వర్యంలో చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన, గర్భిణులకు సీమంతం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శంకరమ్మ, కరుణారెడ్డి, సైరాబేగం, అంగన్వాడీలు, ఆయాలు, గర్భిణులు, బాలింతలు, పాల్గొన్నారు.



చింతలమానెపల్లి: గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

ప్రాక్టికల్ క్లాసులు ప్రారంభం

కాగజ్‌నగర్‌రూరల్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ తీసుకున్న 2016వ బ్యాచ్, ఆ తర్వాత సంవత్సరం నాన్ సెమిస్టర్ డిగ్రీ సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్ క్లాసులు ఏప్రిల్ 1 నుంచి 29వ తేదీ వరకు ఓపెన్ యూనివర్సిటీ, హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు కళాశాల కోఆర్డినేటర్ తూడూరు దత్తాత్రేయ తెలిపారు. ప్రస్తుతం ద్వితీయ సంవత్సరం సెమిస్టర్ -3 చదువుతున్న విద్యార్థులకు సైన్స్ ప్రాక్టికల్స్ ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకు ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు తప్పకుండా హాజరు కావాలని ఆయన సూచించారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్



సీజ్ చేసిన ట్రాక్టర్‌తో మైనింగ్ ఏడీ గంగాధర్

పెంచికల్‌పేట్: మండలకేంద్రంలోని పెద్దవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని సీజ్ చేసినట్లు మైనింగ్ ఏడీ గంగాధర్ శుక్రవారం తెలిపారు. పెద్దవాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారనే పక్కా సమాచారంతో దాడులు చేయగా దహెగాం మండలానికి చెందిన ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు ఆయన వెల్లడించారు. అక్రమంగా ఇసుక, మట్టిని తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మనో ధైర్యంతో పరీక్షలు రాయాలి

లింగాపూర్: విద్యార్థులు మనోధైర్యంతో పరీక్షలు రాయాలని జిల్లా ఏసీఎంవో ఉద్ధవ్ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని కంచన్‌పల్లి ఆశ్రమ పాఠశాలలోని పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులతో మాట్లాడారు. ఆయన వెంట కంచన్‌పల్లి కాంప్లెక్స్ హెచ్ఎం చొక్కారావు, బుచ్చిరాం తదితరులు ఉన్నారు.

పులికుంటలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



పశువులకు టీకా వేస్తున్న పశువైద్యాధికారి సాగర్

రెబ్బెన: మండలంలోని పులికుంటలో శుక్రవారం పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి గ్రామంలోని ఆవులు, గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు అందించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 326 పశువులకు టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి సాగర్ తెలిపారు. సీజన్ వ్యాధులు ప్రబలకుండా పశువులకు ముందస్తు టీకాలు వేయించాలని సూచించారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.